


# శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు వార్త


## గ్రీవెన్స్‌డేలో కుర్చీలు ఖాళీ : అధికారులేరీ ?



**కోవూరు, అక్టోబర్7 ప్రభాతవార్త :** కోవూరులోని తహసీల్దార్ కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే గ్రీవెన్స్ డే కార్యక్రమానికి ప్రధాన శాఖల అధికారులే డుమ్మా కొడుతున్నారు. ఫలితంగా జిల్లా కలెక్టర్ ఏ ఉద్దేశంతో ఈ గ్రీవెన్స్‌డే నిర్వహించారో ఆ ఉద్దేశం ఆశించిన మేర నెరవేరక అర్జీదారులంతా జిల్లా కలెక్టర్ కార్యాలయానికి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రధాన శాఖల అధికారులు రానప్పుడు ఈ గ్రీవెన్స్‌డేకు అర్థం ఏముంటుందని అర్జీదారులు భావిస్తున్నారు. ఈ పరిస్థితి ఎక్కడో మారుమూల ప్రాంతంలో కాదు.. జిల్లా కేంద్రానికి అతి దగ్గరలో ఉన్న కోవూరు తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నెలకొంది. కేవలం ఈ గ్రీవెన్స్ డే కార్యక్రమానికి ప్రధానంగా తహసీల్దార్, ఎంపీడీవోలతో పాటు ప్రధాన శాఖలైన పంచాయతీరాజ్, ఆర్అండ్‌బీ, ఇరిగేషన్, ఆర్‌డబ్ల్యూఎస్ , పోలీస్, ట్రాన్స్‌కో, సంక్షేమ వసతి గృహాలు , వెలుగుతో పాటు మండల విద్యాశాఖ, ఐసీడీఎస్ అధికారులు రావాల్సి ఉంది. అయితే సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌డేలో తహసీల్దార్, ఎంపీడీవోతో పాటు ఐసీడీఎస్, ఆర్‌డబ్ల్యూఎస్, వెలుగు, ఇరిగేషన్ అధికారులు మాత్రమే హాజరయ్యారు తప్ప మిగిలిన ప్రధాన శాఖలు హాజరు కాలేదు. దీంతో కోవూరు మండలానికి సంబంధించిన అర్జీదారులు గ్రీవెన్స్‌డేకు వస్తే తమ సమస్యలు పరిష్కారం కావని, నేరుగా జిల్లా కలెక్టర్ దగ్గరకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఈ గ్రీవెన్స్‌డేకు సంబంధించి అన్ని శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరయ్యేలా చొరవ తీసుకోవాల్సిన పరిస్థితి ఉంది.

## సిఎం చంద్రబాబుని కలిసిన ఎంపి వేమిరెడ్డి



**నెల్లూరు రూరల్, అక్టోబర్ 7, ప్రభాతవార్త** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి ఢిల్లీలో నెల్లూరు ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి స్వాగతం పలికారు. ఢిల్లీలో సోమవారం ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, ఇతర కేంద్ర మంత్రులను కలిసేందుకు సిఎం చంద్రబాబు ఢిల్లీ చేరుకున్నారు. ఈ నేపథ్యంలో ఢిల్లీ విమానాశ్రయానికి చేరుకున్న ఆయనకు ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ఇతర ఎంపిలు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎంపి వేమిరెడ్డిని సిఎం ఆప్యాయంగా పలకరించారు.

## నాదెండ్లని మర్యాదపూర్వకంగా కలిసిన వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డి



**నెల్లూరు, అక్టోబర్ 7, ప్రభాతవార్త-వైద్యం** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌరసరఫరాల శాఖ డైరక్టర్‌గా నియమితులైన సందర్భంగా సోమవారం విజయవాడలో డైరక్టర్‌గా ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం వేమిరెడ్డి పట్టాభి రామిరెడ్డి పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌ని కలిశాడు. విజయవాడలోని సివిల్ సప్లై కార్యాలయంలో జరిగిన పదవీ ప్రమాణ స్వీకారోత్సవానికి రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌తో పాటు చైర్మన్ తోట సుధీర్‌బాబు, నారాయణ విద్యాసంస్థలు జనరల్ మేనేజర్ సోదరుడు వేమిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డితో పాటు పలువురు తెలుగుదేశం పార్టీ నాయకులు విచ్చేసి వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డికి పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈసందర్భంగా వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డి మాట్లాడుతూ తనపై నమ్మకంతో పౌరసరఫరాల శాఖ డైరక్టర్‌గా అవకాశం ఇచ్చిన రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు నారా చంద్రబాబునాయుడు అలాగే రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కి, నాదెండ్ల మనోహర్‌కి ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. తన పరిధిలోని శాఖకు సంబంధించిన వ్యవహారాలను అనుక్షణం పర్యవేక్షించడమే కాకుండా ప్రజలకు నాణ్యమైన సేవలు అందిస్తానని పట్టాభి పేర్కొన్నారు.

## మత్స్య, సేంద్రియ ఉత్పత్తులను ప్రోత్సహించండి : మేయర్



**నెల్లూరు కార్పొరేషన్, అక్టోబర్ 7, ప్రభాతవార్త:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 5,6,7 తేదీలలో నెల్లూరు నగరంలోని స్థానిక వి.ఆర్ కళాశాల మైదానంలో నిర్వహించిన 3వ రాష్ట్ర ఆర్గానిక్ ఫిష్ ఫుడ్ ఫెస్టివల్ లో ముఖ్య అతిథిగా నెల్లూరు నగరపాలక సంస్థ మేయర్ మాట్లాడుతూ మత్స్య కార సంక్షేమ సమితి జలనిధి ఫిషర్ మెన్ స్టేట్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమం ద్వారా సముద్ర ఆహార ఉత్పత్తులకు జిల్లా వ్యాప్తంగా మంచి ప్రచారం లభించాలని ఆకాంక్షించారు. మన శారీరక ఆరోగ్యాన్ని కాపాడుకోవడం కోసం ఈ సముద్రపు ఆర్గానిక్ మత్స్య ఉత్పత్తులు ఎంతగానో సహాయపడుతున్నాయని, మన ఆరోగ్యం కోసం అందరికి తెలిసే విధంగా ప్రచారం చేయడం కోసం ఈఫెస్టివల్స్ నిర్వహించడం ఆదర్శనీయమని మేయర్ తెలిపారు.

## విచారణ జరిపి చట్టపరంగా న్యాయం : జిల్లా ఎస్పి కృష్ణకాంత్



**నెల్లూరు క్రైం, అక్టోబర్ 7, ప్రభాతవార్త** ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో అందే ఫిర్యాదులపై విచారణ జరిపి చట్టపరంగా న్యాయం చేస్తామని జిల్లా ఎస్పి కృష్ణ కాంత్ హామీ ఇచ్చారు. స్థానిక ఉమేష్ చంద్ర కాన్ఫరెన్స్ హాల్‌లో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించి ఎస్పి ఫిర్యాదులు స్వీకరించారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా స్వీకరించిన ఫిర్యాదులపై త్వరితగతిన స్పందించి, సమస్యను పరిష్కరించాలని పోలీసు అధికారులను ఆయన ఆదేశించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుండి మొత్తం 97 వినతులు స్వీకరించారు. ఆయా సమస్యలపై విచారణ జరిపి చట్టపరమైన న్యాయం చేయాలని ఎస్పి ఆయా పోలీస్ స్టేషన్ల అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో రూరల్ డిఎస్పి జి. శ్రీనివాస రావు, ఎస్బిసిఐ శ్రీనివాస రెడ్డి, కంప్లైంట్ సెల్ సిబ్బంది పాల్గొన్నారు.

## పునరావృతం కాకుండా ప్రజా సమస్యలను పరిష్కరించండి



**నెల్లూరు కార్పొరేషన్, అక్టోబర్ 7, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికను నెల్లూరు నగరపాలక సంస్థ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ హాల్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించారు. అదనపు కమిషనర్ శర్మద పాల్గొని అర్జీదారుల నుంచి వినతి పత్రాలను స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు కమిషనర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వివిధ అంశాల పై ప్రజల నుంచి అందుకున్న ఫిర్యాదులు పునరావృతం కాకుండా శాశ్వత పరిష్కారం అందిచాలని, వాటన్నింటికీ నిర్ణీత సమయంలోగా పరిష్కారం అందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం అందుకున్న వినతులు పునరావృతం కాకుండా అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో శాశ్వత పరిష్కారం అందించాలని అదనపు కమిషనర్ సంబంధిత సెక్షన్ అధికారులకు సూచించారు. విభాగాల వారీగా రెవెన్యూ -2, ఇంజనీరింగ్ -10, టౌన్ ప్లానింగ్ -6, పబ్లిక్ హెల్త్ -2, హౌసింగ్ -4, మొత్తం 24 ఫిర్యాదులను ప్రజా సమస్యల పరిష్కార వేదికలో నగర పాలక సంస్థ ఇంజనీరింగ్ ఎస్. ఈ రామ్మోహన్, సిటీ ప్లానర్ కృష్ణ కిషోర్, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ చైతన్య, మేనేజర్ ఇనాయతుల్లా, ఇతర అన్ని విభాగాల అధికారులు సూపరింటెండెంట్ లు, సిబ్బంది పాల్గొన్నారు.

## రాజరాజేశ్వరీ అలంకారంలో జొన్నవాడ కామాక్షితాయి



**బుచ్చి అక్టోబర్ 7 ప్రభాతవార్త** బుచ్చిరెడ్డిపాళెం మండలంలోని పవిత్రపుణ్యక్షేత్రమైన జొన్నవాడలో శరన్నవరాత్రి వేడుకలలో భాగంగా శ్రీమల్లికార్జునస్వామి కామాక్షితాయి అమ్మవారు రాజరాజేశ్వరీ అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు పెద్దఎత్తున పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమాలను ఆలయ ఇఒ ఆర్వభూమి శ్రీనివాసులరెడ్డి పర్యవేక్షించారు.

## గాయత్రి అలంకారంలో దర్శనమిచ్చిన కన్యకాపరమేశ్వరి



**నెల్లూరు, అకో బరు7 ప్రభాతవార్త-విద్య** దేవీ శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా నగరంలోని స్థానిక స్టోన్‌హౌస్‌పేటలో వెలసియున్న శ్రీ వాసవి కన్యాకాపరమేశ్వరి అమ్మవారికి సోమవారం గాయత్రి అలంకారాన్ని గావించారు. అలాగే మూలవర్లకు ముత్యాల చీరలతో ప్రత్యేక అలంకారాలు, పూలంగి సేవలను చేపట్టారు. ఉభయకర్తలుగా యేల్చూరు శ్రీనివాసరావు దంపతులు, కొనగళ్ల శ్రీనివాసులు, సుబాషిణి దంపతులు వ్యవహరించి అమ్మవారికి ప్రత్యేకపూజలు గావించారు. సాయంత్రం ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు వితరణ చేశారు. సాయంత్రం లక్ష్మీనారాయణ కొలాట మండలి ఆధ్వర్యంలో కోలాటం, ప్రీ ఆదిగురు కూచిపూడి కళానిళయం ఆధ్వర్యంలో కూచిపూడి, భరతనాట్యం వంటి సాంస్కృతిక కార్యక్రమాలు చూపరులను విశేషంగా ఆకట్టుకుంది. ఈ సందర్భంగా ఆలయ పాలక మండలి చైర్మన్ కోట గురుబ్రహ్మం, గౌరవాధ్యక్షులు కొండా ప్రవీన్ శంకర్, ఆర్యవైశ్యమహాసభ రాష్ట్ర నాయకులు శేగు షణ్ముకరావులు మాట్లాడుతు భక్తులకు ఎటువంటి అసౌకార్యలు జరుగకుండా అన్నీ ఏర్పాట్లు చేశామన్నారు. ఉత్సవాల్లో భాగంగా సోమవారం అమ్మవారికి గాయత్రీ అలంకారం చేయటం జరుగుతుందని భక్తులు అందరూ పాల్గొని అమ్మవారిని దర్శించి తరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రదాన కార్యదర్శి నిచ్చెనమెట్ల చిరంజీవి, కోశాదికారి జనార్దన్‌రావు, ఉపాధ్యక్షులు వేముల ప్రసాద్, సమాయ కార్యదర్శి మేముల ప్రసాద్, గౌరవ సలహాదారులు ఎంపి ఆంజనేయులు, ఉత్సవ

## జిల్లాలో ఇసుక కొరత లేదు

**70 వేల టన్నుల ఇసుక అందుబాటులో టోల్ ఫ్రీ నెంబరు 0861 2943569 ఏర్పాటు**

**జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్**



**నెల్లూరు అర్బన్, అక్టోబర్ 7, ప్రభాతవార్త** జిల్లాలో ఇసుక నిల్వలు సమృద్ధిగా ఉన్నాయని, జిల్లాలోని మూడు ఇసుక యార్డులలో 70 వేల టన్నుల ఇసుక అందుబాటులో ఉందని, సరఫరాకు ఎలాంటి ఇబ్బందులు లేవని కలెక్టర్ ఆనంద్ పేర్కొన్నారు. జిల్లాలో ఇసుక నిల్వలు, సరఫరాపై సోమవారం ఉదయం కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో కలెక్టర్, ఎస్పీ పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఇసుక కొరత లేదని, ప్రజల అవసరాల కంటే రెట్టింపు ఇసుక అందుబాటులో వుందని చెప్పారు. జిల్లాలోని మూడు ఇసుక యార్డులలో 70 వేల టన్నుల ఇసుక అందుబాటులో ఉందన్నారు. మన జిల్లాలో గత ఏడాది కంటే 50 శాతం తక్కువ ధరకు ఒక టన్ను ఇసుకను రూ. 350కే అందిస్తున్నట్లు చెప్పారు. జిల్లా ప్రతిరోజు సుమారు 3500 టన్నుల అసుక అవసరమవుతుందని, మన దగ్గర సుమారు 4500 టన్నుల వరకు ఇసుక అందుబాటులో వుందని, దీనిని 7000 మెట్రిక్ టన్నుల వరకు పెంచనున్నట్లు కలెక్టర్ చెప్పారు. మన జిల్లాతో పాటు ప్రకాశం, బాపట్ల జిల్లాలకు ఇసుకను అందించనున్నట్లు చెప్పారు. కందుకూరులో మరో యార్డును ప్రారంభిస్తున్నామని, ఈ నెల 15వ తేది తరువాత మరో నాలుగు ఓపెన్ రీచ్‌లను ప్రారంభించేందుకు చర్యలు చేపట్టామన్నారు. మినగల్లు, పడమటి కంభంపాడు, పల్లిపాడు, విరువూరులో ఈ ఓపెన్ రీచ్‌లను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. త్వరలో డిసిల్టేషన్ ఓపెన్ రీచ్‌లను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. త్వరలో డిసిల్టేషన్ పాయింట్ల ద్వారా 226198 టన్నులు, సెమి మెకనైజ్డ్ రీచ్‌ల ద్వారా 13,03,500 టన్నులు, ఓపెన్ రీచ్‌ల ద్వారా 286500 టన్నులు మొత్తం 1816198 టన్నుల ఇసుకను జిల్లాలో ప్రజలకు అందుబాటులో తీసుకొచ్చేందుకు అన్ని చర్యలు చేపట్టామని కలెక్టర్ వివరించారు. ప్రజలు ఎవరు కూడా ఇసుక కోసం దళారులను ఆశ్రయించవద్దని, ప్రజలందరూ ఏపి శాండ్ పోర్టల్ ద్వారా మాత్రమే ఇసుకను బుక్ చేసుకోవాలని సూచించారు. ఏపి శాండ్ పోర్టల్‌లో ఇసుక బుక్ చేసుకున్న వారు సొంత వాహనం ద్వారా ఇసుక తీసుకెళ్లవచ్చని లేదంటే పోర్టల్‌లోని ట్రాన్స్‌పోర్టు సౌకర్యం కూడా ఎంచుకునే అవకాశం కల్పిస్తున్నట్లు చెప్పారు. ట్రాన్స్‌పోర్టు చార్జీలను సిస్టం ద్వారా నిర్ణయిస్తామని, ఆ మేరకు పోర్టల్‌తో అనుసంధానమైన 300 పైగా ట్రాన్స్‌ఫోర్టర్లలో ఎవరైనా ముందుకొచ్చి ఇసుకను సిస్టం నిర్ణయించిన ధరకే రవాణా చేస్తారని చెప్పారు. ట్రాన్స్‌ఫోర్టు ధరల విషయంలో ఎలాంటి ఫిర్యాదులు రాకుండా అన్ని చర్యలు చేపట్టామన్నారు. ప్రజల అవసరాలకు పోను ప్రైవేటు, ప్రభుత్వ భవన నిర్మాణాలకు బల్క్‌గా ఇసుక సరఫరాకు పోర్టల్‌లో 25 శాతం కేటాయించామని, బల్క్ బుకింగ్స్‌ను జేసి పరిశీలించి ఆమోదించనున్నట్లు చెప్పారు. ఇసుక పక్కదారి పట్టకుండా జిల్లా టాస్క్‌ఫోర్సు కమిటీని నియమించినట్లు కలెక్టర్ చెప్పారు. ఇసుక దుర్వినియోగం కాకుండా బుక్ చేసుకున్న ఇసుకను సక్రమంగా వినియోగిస్తున్నారా లేదా అని క్షేత్రస్థాయిలో సచివాలయ వ్యవస్థ, జిపిఎస్ ట్రాకింగ్ ద్వారా పర్యవేక్షించనున్నట్లు చెప్పారు.

**ఇసుక ఫిర్యాదులు, సమాచారం కోసం టోల్ ఫ్రీ నెంబరు 0861 - 2943569 ఏర్పాటు** నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్‌లోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ఫెసిలిటేషన్ సెంటర్, హెల్ప్ డెస్క్ కోఆర్డినేషన్ టీంను 8 మంది సచివాలయ ఉద్యోగులతో ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ చెప్పారు. ఈ టీం వినియోగదారులు, ట్రాన్స్‌పోర్టర్లతో సమన్వయం చేసుకుంటూ ఇసుక సకాలంలో సరఫరా అయ్యేందుకు పనిచేస్తుందని చెప్పారు. ఇసుక ఫిర్యాదులు, సమాచారం, సందేహాల కోసం టోల్ ఫ్రీ నెంబరు 0861 - 2943569ను ప్రజలు సంప్రదించాలని కలెక్టర్ సూచించారు. ప్రజల నుంచి ఎప్పటికప్పుడు ఫీడ్ బ్యాక్ కూడా తీసుకుంటున్నట్లు కలెక్టర్ చెప్పారు. ఇసుకను పారదర్శకంగా ప్రజలకు అందించేందుకు జిల్లా యంత్రాంగం పనిచేస్తుందని, ఎవరైనా సరే ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని కలెక్టర్ హెచ్చరించారు.

**ఇసుక అక్రమ రవాణాపై గట్టి నిఘా ఉంచాం... ఎస్పీ కృష్ణకాంత్** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న నూతన ఇసుక విధానంలో అక్రమాలు జరగకుండా అన్ని చర్యలు చేపట్టినట్లు ఎస్పీ కృష్ణకాంత్ చెప్పారు. రెవెన్యూ, మైనింగ్, పోలీసు అధికారులతో క్షేత్ర స్థాయిలో తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. జిల్లాలోని మూడు ఇసుక యార్డులు వద్ద సిసి కెమెరాలతో నిఘా వుంచామని, గుర్తింపు పొందిన వాహనాలను మాత్రమే యార్డులలోనికి అనుమతిస్తున్నట్లు ఎస్పీ చెప్పారు. ఇప్పటి వరకు 350 మందిపై కేసులు నమోదు చేశామని, 290కి పైగా వాహనాలను సీజ్ చేసినట్లు ఎస్పి వివరించారు. మీడియా వారు కూడా ఇసుక అక్రమాలపై సమాచారాన్ని తమ దృష్టికి తీసుకొస్తే వెంటనే చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజలందరూ కూడా ఇసుక కోసం దళారుల మాటలు, నమ్మకుండా ప్రభుత్వ నిబంధనల మేరకు ఆన్‌లైన్‌లో బుక్ చేసుకోవాలని సూచించారు.

## ఆనం పై విరుచుకుపడ్డ కార్పొరేటర్లు

**మీ ఉడత బెదిరింపులకు భయపడేదేలే**

**నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడు**

**డివిజన్ అభివృద్ధి కోసమే పార్టీ మారాం**



**నెల్లూరు రూరల్, అక్టోబర్ 7, ప్రభాతవార్త** నిన్న మొన్నటి దాకా ప్రశాంతంగా ఉన్న నెల్లూరు రూరల్‌లో ఒక్క మీటింగ్‌తో రచ్చరచ్చగా మారింది. ఆదివారం జరిగిన రూరల్ వైఎస్ఆర్‌సిపి ఆత్మీయ సమావేశంలో ఆనం విజయ్ కుమార్ రెడ్డి మాట్లాడిన మాటలకు వైసిపి నుంచి మారి టిడిపిలో చేరిన కార్పొరేటర్లు గట్టిగానే కౌంటర్ ఇచ్చారు. కార్పొరేటర్లు, సోమవారం ఓ ప్రైవేటు హోటల్లో విలేకర్ల సమావేశం నిర్వహించిన కార్పొరేటర్లు పిండి సురేష్, అశోక్ నాయుడు, మూలె విజయభాస్కర్ రెడ్డి, జాన నాగరాజు గౌడ్, పడిగినేటి రామ్మోహన్ యాదవ్, సుధాకర్, ఒరిస్సా శ్రీనివాసులు రెడ్డి, టిడిపి నాయకులు పాలకుర్తి రవి, దారా వంశి, బెల్లంకొండ పెంచల నారాయణ, రియాజ్, యాకసిరి శరత్ చంద్ర, కువాకొల్లు బాబ్జి ఆనం విజయ్ కుమార్ రెడ్డి పై ఫైరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైఎస్ఆర్ సిపికి గత ఎన్నికల్లో సొంత గ్రామంలో మెజారిటీ తేలేని ఆనం విజయ్ కుమార్ రెడ్డి టిడిపి, జనసేన పార్టీలపై ప్రగల్బాలు పలకడం సిగ్గుచేటు అన్నారు. టిడిపి నాయకులు తాటతీస్తా, తోలు తీస్తా అని ఉడత బెదిరింపులకు పాల్పడుతున్న ఆనం విజయ్ కుమారి రెడ్డి ఒళ్ళు దగ్గర పెట్టుకోని మాట్లాడాలని హితవు పలికారు. ఎన్నికల ఖర్చుల కోసం ఆదాల ప్రభాకర్ రెడ్డి వద్ద కోట్లాది రూపాయలు డబ్బు తీసుకొని పైసా ఖర్చు పెట్టకుండా చింతా రెడ్డి పాలెంలో సైతం డబ్బు ఇవ్వకుండా ఆదాల ప్రభాకర్ రెడ్డికి వెన్నుపోటు పొడిచిన నీచ నికృష్టుడు ఆనం విజయ్ కుమార్ రెడ్డిని అన్నారు. వైసిపి కార్పొరేటర్ల సర్పంచుల నాయకుల కార్యకర్తల కష్టాన్ని డబ్బులు సంపాదనకి అమ్ముకునే ఆనం విజయకుమార్ రెడ్డి లాంటి నయవంచకుడితో నడవడం ఇష్టం లేక వైసిపికి రాజీనామా చేస్తుంటే వైసిపికి రాజీనామా చేసిన కార్పొరేటర్లు నాయకులను అమ్ముడుపోయారు. అంటున్న ఆనం విజయకుమార్ రెడ్డి నీ సొంత సోదరుడు ఆనం జయకుమార్ రెడ్డిని ఎన్నికల ముందు తీసుకెళ్లి జగన్ రెడ్డి వద్ద వైసిపిలో చేర్పించావు ఎన్నికల్లో ఆదాల ప్రభాకర్ రెడ్డికి చెప్పి ఆనం విజయకుమార్ రెడ్డికి నగరంలో పెత్తనం ఇప్పించావు మరి ఇప్పుడు ఆ ఆనం జయకుమార్ రెడ్డి, వైసిపిలో కనబడకుండా నిన్నటి రోజున నీ మీటింగ్ కూడా రాకుండా టిడిపిలో చేరాలని ప్రయత్నాలు చేసుకుంటున్నారే ఆయన ఎంతకు అమ్ముడుపోయాడో చెప్పండి అయ్యా అని ప్రశ్నించారు. నీ సొంత సోదరుడు ఆనంద జయకుమార్ రెడ్డి నీ వెంట తిప్పలేని నువ్వు కార్యకర్తలని నాయకులని ఏ విధంగా తిప్పుకుంటావో సమాధానం చెప్పాలని తెలిపారు. పార్టీ మారడం స్వార్ధ ప్రయోజనాలు కానీ మాట్లాడడం సరైన పద్ధతి కాదని డివిజన్ అభివృద్ధి కోసమే పార్టీ మారాల్సి వచ్చిందని తెలిపారు. గతంలో వైసిపిని విభేదించి బయటికి వచ్చిన కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డితో మేము వెళ్ళకపోవడానికి అభివృద్ధి ఎక్కడ జరగదు అన్న ఒకే ఒక కారణంతో ఆ రోజు పార్టీ మారలేదని కానీ అధికారంలో ఉన్న పార్టీకి వెళితే డివిజన్ అభివృద్ధికి అన్ని విధాల సహాయంగా ఉంటుందని పార్టీ మారాల్సి వచ్చిందని వారు తెలిపారు.

## ఎమ్మెల్యేని కలిసిన ఆర్డివో



**నెల్లూరు రూరల్, అక్టోబర్ 7, ప్రభాతవార్త** నెల్లూరు రూరల్‌లో నూతనంగా పదవి బాధ్యతలు చేపట్టిన ఆర్డివో నాగ సంతోష్ అనూష రూరల్ ఎమ్మెల్యే కార్యాలయంలో ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు.

## ఎస్సీ, ఎస్టీ కేసును నమోదు చేయాలి



**నెల్లూరు రూరల్, అక్టోబర్ 7, ప్రభాతవార్త** ఓ భూమి విషయంలో దళితులపై దాడి చేసిన నిందితులపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసులను నమోదు చేయాలని ఎమ్మార్పిఎస్ వ్యవస్థాపక మన అధ్యక్షుడు పల్లాల శ్రీనివాసులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన ప్రజా విజ్ఞప్తిల దినోత్సవంలో జిల్లా కలెక్టర్ కార్యాలయంలో బాధితులతో కలిసి కలెక్టర్ ఆనంద్‌కు సోమవారం వినతి పత్రం అందజేశారు. అనంతరం జిల్లా ఎస్పితో మాట్లాడుతూ మనుబోలు పోలీస్ స్టేషన్ పరిధిలోని వీరంపల్లి గ్రామ పంచాయితీ కొండూరు పాలెం అరుంధతిపాలెంకు చెందిన గుండుపాక వేణు, కాంతమ్మలకు గత 30 సంవత్సరాల క్రితం ప్రభుత్వం అందజేసిన సర్వే నెంబర్ 1183/1 కింద రెండు ఎకరాలు 30 సెంట్లు భూమి ఇవ్వడం జరిగిందన్నారు. దానికి సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నామని నేడు గ్రామానికి చెందిన అగ్రకులస్తులు కొంతమంది రెండు సెంట్లు ప్రభుత్వ భూమి ఉంది అంటూ దౌర్జన్యం చేసి దాడి చేశారని దీనిపై పోలీసు స్టేషన్‌లో కూడా ఫిర్యాదు చేశామని నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే స్థానిక సర్వేయర్‌ను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సర్వేపల్లి నియోజకవర్గం మన ఎమ్మార్పిఎస్ అధ్యక్షులు కాకులూరి శ్రీనివాసులు, తాళ్లపాక ఏడుకొండలు, పెట్టపు హరి, తాడిపత్రి రమేష్, రామసుబ్బయ్య, జిలాని, రంగయ్య, పాలెపు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## ఆర్డీవోగా బాధ్యతలు చేపట్టిన నాగ సంతోష్ అనూష



**నెల్లూరు రూరల్, అక్టోబర్ 7, ప్రభాతవార్త** నెల్లూరు రెవెన్యూ డివిజనల్ అధికారిగా పదవి బాధ్యతలు స్వీకరించిన నాగ సంతోష అనూషని సోమవారం రెవెన్యూ డివిజనల్ అధికారి వారి కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ గ్రామ రెవెన్యూ అధికారులు సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నాగ శేఖర్, జాయింట్ డైరెక్టర్ మర్యాద పూర్వక కలిసి పుష్పగుచ్ఛం అందజేసారు. ఈ కార్యక్రటంలో ఆర్డివోని కలిసిన వారిలో జిల్లా అధ్యక్షులు పి. అశోక్ కుమార్ రెడ్డి, జిల్లా కార్యదర్శి దారా రమణయ్య, డివిజన్ అధ్యక్షుడు ఎన్. నాగేశ్వర రావు, జిల్లా కార్యవర్గ సభ్యులు నాగరాజు, చలపతి, అనిల్, అజయ్, రాజేశ్వరి, నాగేశ్వరి, అరుణ, పెంచల్రావు, హరిబాబు, సర్వేశ్వర రావు, జయరాజు, పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

## టిడిపిలో చేరిన శ్రీలంక కాలనీ వాసులు



**నెల్లూరు రూరల్, అక్టోబర్ 7, ప్రభాతవార్త** నెల్లూరు రూరల్ నియోజకవర్గం ఎమ్మెల్యే కార్యాలయంలో రూరల్ ఎమ్మెల్యే కోటం రెడ్డి శ్రీధర్ రెడ్డి, కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరిన 31వ డివిజన్ శ్రీలంక కాలనీకి చెందిన వైసిపి నాయకులు మాణిక్యం సతీష్ తన అనుచరులతో కలిసి పార్టీ కండువా కప్పుకున్నారు.

## బాలత్రిపుర సుందరి దేవి అలంకారంలో కామాక్షిదేవి



**సంగం అక్టోబర్ 7 ప్రభాతవార్త** మండలకేంద్రమైన సంగంలోని శ్రీసంగమేశ్వరస్వామి, కామాక్షిదేవి సన్నిధిలో శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా కామాక్షిదేవి అమ్మవారు బాలత్రిపుర సుందరి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉభయకర్తలుగా కాకు వెంకటకొండయ్య జ్ఞాపకార్థం ఆయన ధర్మపత్ని రంగమ్మ కుమారుడు వ్యవహరించారు. భక్తులు పెద్దఎత్తున పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

## మోహిని అలంకారంలో శ్రీవాసవీకన్యకాపరమేశ్వరీ అమ్మవారు



**సీతారామపురం అక్టోబర్ 7 ప్రభాత వార్త** విజయ దశమి నవరాత్రి ఉత్సవాల లో భాగంగా సీతారామపు రంలోని శ్రీవాసవీ కన్య కాపర మేశ్వరీ సన్నిధి లో అమ్మ వారు మోహిని అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ప్రతి రోజు వివిద రూపాలలో అమ్మ వారు భక్తులకు దర్శనమిస్తుందని చెప్పారు.అనంతరం భక్తులకు తీర్ద ప్రసాదాలు ఆలయ పూజారులు భక్తులు అందచేశారు.భక్తులందరు అమ్మవారిని దర్శించుకొవాలని ఆలయ కమీటి సభ్యులు కోరారు.

## గొప్ప నాయకుని కోల్పోయాం



**గుడ్లూరు, అక్టోబర్ 7, ప్రభాతవార్త** గుడ్లూరు మండలం జడ్పీటీసీ సభ్యులు కొరిశపాటి బాపిరెడ్డి అంత్యక్రియలకు హాజరైన ప్రముఖులు ఆయన భౌతికకాయానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. గుడ్లూరు మండలం గుండ్లపాలెంలో బాబిరెడ్డి అంత్యక్రియలు సోమవారం నిర్వహించారు. వైసీపీ నాయకులు జడ్పీటీసీ సభ్యులు బలిరెడ్డి మరణించడం వలన గొప్ప నాయకుడిని కోల్పోయామని మహీధర్‌రెడ్డి అన్నారు. మృదుస్వభావి అయిన బాపిరెడ్డిని మండల ప్రజలు మరిచిపోలేరని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మండల నలుమూలల నుంచి వైసీపీ కార్యకర్తలు, బాబిరెడ్డి అభిమానులు పాల్గొని నివాళులర్పించారు. ప్రముఖులు తోటి తోకల కొండయ్య, పాజెర్ల సర్పంచ్ వెంకటేశ్వర్లు, ఎంపీడీఓ వై.వెంకటేశ్వర్లు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## కొండలను మింగిన అనకొండ కాకాణి



**నెల్లూరు, అక్టోబర్ 7, ప్రభాతవార్త-వైద్యం** కొండలని మింగేసిన అనకొండ మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఎస్సీ సెల్ అధికార ప్రతినిధి మాతంగి కృష్ణ ధ్వజమెత్తాడు. నగరంలోని తెలుగుదేశం పార్టీ జిల్లా కేంద్ర కార్యాలయంలో కృష్ణ విలేకర్ల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ హయాంలో అష్టకష్టాలు పడిన ప్రజలు ఈ ప్రభుత్వంలో సంతోషంగా ఉన్నారన్నారు. ప్రజలు సంతోషంగా ఉండటం నెల్లూరు జిల్లాలోని తోడేరు రెడ్డికి నచ్చడం లేదన్నారు. నిత్యం ప్రెస్‌మీట్‌లు పెట్టుకుంటూ ఓ వైపు చంద్రబాబు నాయుడిని, మరో వైపు చంద్రమోహన్‌రెడ్డిని తిడుతూ కల్లబొల్లి మాటలు చెబుతున్నాడని విమర్శించారు. నోటికొచ్చిన అబద్దాలు చెబుతూ ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నంలో ఉన్నాడని ఆరోపించారు. స్మశానికి మట్టి తోలినా, ప్రజలు సొంత అవసరాలకు తోలుకున్న సోమిరెడ్డి, ఆయన కొడుకు అమ్మేసుకున్నారంటూ సిగ్గులేకుండా అబద్దాలను చెబుతూ నిజం చేయాలని చూస్తున్నారు. చారిత్రక ప్రాశస్త్యం కలిగిన ప్రభగిరి పట్నంలో కొండలు ఎత్తేయడంతో పాటు దేవుడి విగ్రహాలను కూడా ఆయన వదిలిపెట్టలేదని వెల్లడించారు. వైసీపీ పాలన సమయమంతా ఇసుక, గ్రావెల్, క్వార్జ్ అక్రమ రవాణాతో సొంత ఖజానా నింపుకున్న కాకాణి గోవర్ధన్‌రెడ్డికి ఏ రోజు ప్రజల సమస్యలు పట్టలేదని మండిపడ్డాడు. అక్రమాలు, అవినీతితో వందల కోట్లు దోచుకుని ఈ రోజు ఇంట్లో కూర్చుని అబద్దాలు చెప్పుకుంటూ గడిపేస్తున్నాడన్నారు. అబద్దాలు చెప్పి పబ్బం గడపాలనుకునే గోవర్ధన్‌రెడ్డి మాటలు ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు. చేసిన పాపాలకు జైలుకు పోవడం తప్పదని తెలియడంతోనే ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు రకరకాల అబద్దాలు చెప్పుకుంటున్నాడని తెలిపారు. ఇప్పుడు ప్రజలతో ఛీదరించుకుని ఇంట్లో కూర్చుని బుడ్డ బెదిరింపులకు దిగుతున్నాడు. కాకాణి చేసిన దొంగతనాలు, దోపిడిని వెలుగులోకి తెచ్చిన అధికారులను కూడా బ్లాక్ మెయిల్ చేయడానికి దిగాడని గోవర్ధన్‌రెడ్డి ఉడత బెదిరింపులకు ఆయన ఇంట్లో వాచ్‌మెన్ కూడా భయపడే పరిస్థితి లేదన్నాడు. దళిత సోదరుడు ఉదయగిరి నారాయణ హత్య పాపం కూడా కాకాణిదే ఇక దళితులపై పెట్టిన అక్రమ కేసులు, కక్షసాధింపులకు లెక్కేలేదని విమర్శించాడు. వైసీపీహయాంలో లెక్కకు మించి పాపాలు చేసిన కాకాణితో పాటు ఆయన చెంచాలు జైలుకు పోవడం తథ్యమన్నారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు రూరల్ నియోజకవర్గం ఉయ్యాల జగన్‌మోహన్, నెల్లూరు పార్లమెంట్ బీసీ సెల్ అధికార ప్రతినిధి ఉప్పు భాస్కరరావు, నియోజకవర్గ ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి నందిపాటి ఇజ్రాయిల్, షేక్ రషీద్, సీహెచ్ వెంకటరమణ, ఏ.సురేష్, సిద్దవరపు పెంచలయ్య, వై.పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

## వరి వేరుశనగ పైరుపై అవగాహన కార్యక్రమం



**ఉలవపాడు, అక్టోబర్ 7, ప్రభాతవార్త** ఉలవపాడు మండలం కరేడు- 1 రైతు సేవ కేంద్రం నందు సోమవారం నెల్లూరు జిల్లా వనరుల కేంద్రం సహాయ వ్యవసాయ సంచాలకులు సీహెచ్ రమాదేవి, లక్ష్మీ మాధవి వరి, వేరుశనగ పైరుపై అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. వరి పైరులో నారుమడి యాజమాన్యం విత్తన ఎంపిక విత్తన శుద్ధి గురించి ప్రధాన పొలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు అనగా సమగ్ర ఎరువుల యాజమాన్యం, సమగ్ర సస్యరక్షణ విధానాల మీద ఏ పురుగు ఎప్పుడు ఆశిస్తుంది అనే అంశాల మీద పలు యాజమాన్య పద్దతుల మీద రైతులకు అవగాహన కలిగించడం జరిగింది. వేరుశనగలో రైతులకు విత్తన రకాలు, వాటి ప్రాముఖ్యత, నులిపురుగుల నివారణకు పాటించాల్సిన యాజమాన్య పద్ధతులు మీద అవగాహన కల్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కరేడు గ్రామ వ్యవసాయ సహాయకులు ఆర్.వంశీకృష్ణ, జి.మానస, ప్రియదర్శిని, రైతులు పాల్గొన్నారు.

## పదిన మండల సర్వసభ్యసమావేశం

**జలదంకి, అక్టోబర్7, ప్రభాతవార్త:** జలదంకి మండల సర్వసభ్య సమావేశం ఈనెల 10న జరుగునని ఎంపిడిఒ బ్రహ్మయ్య నేడొక ప్రకటనలో తెలియజేశాడు.మండల ప్రజాపరిషత్ సమావేశపు హాలులో ఎంపిపి గోచిపాతల వెంకట రమణయ్య అధ్యక్షతన నిర్వహించే సమావేశానికి ప్రజాప్రతినిధులు,అన్నిశాఖల అదికారులు హాజరుకావాలని ఆయన విజ్ఞప్తిచేశారు.

## నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడు



**నెల్లూరు రూరల్, అక్టోబర్ 7, ప్రభాతవార్త**నెల్లూరు రూరల్ శాసన సభ్యులు కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి పై ఆనం విజయ్ కుమార్ రెడ్డి మాట్లాడిన మాటలు పై పాలకర్తి రవి ఫైర్ అయ్యారు. సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించిన పాలకర్తి రవి మాట్లాడుతూ ఒక ఎమ్మెల్యేని ఒరే తరే అని అసభ్యకరంగా మాట్లాడడం సరికాదని నోరు అదుపులోకి పెట్టుకోవాలని ఆనం విజయ్ కుమార్ రెడ్డికి హితవు పలికారు. గత ఎన్నికల్లో వైసిపి పక్షాన ప్రచారం చేసిన మీరు కనీసం మీ సొంత గ్రామంలో వైసిపికి మెజారిటీ తెప్పించలేని మీరు ఒక ఎమ్మెల్యేని మాట్లాడే స్థాయి నీది కాదన్నారు. జనసేన, టిడిపి నాయకుల్ని తోలు తీస్తా తాటతీస్తా అని మాట్లాడుతున్నారు. అలాంటి మాటలు ఇకనైనా మాట్లాడడం ఆపాలని అన్నారు. ఇంచార్జ్ ఇచ్చిన అంతమాత్రాన గ్రామ స్థాయి నాయకుడు కూడా కానీ మీరు ఒక ఎమ్మెల్యేని మాట్లాడే అర్హత మీకు లేదన్నారు. కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి మంచి నాయకుడిని ఇష్టానుసారం మాట్లాడితే పరిస్థితులు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు.

## పొదలకూరు పూర్వపు తహశీల్దార్ వీర వసంతరావు అవినీతి పై చర్యలు ఏవి?



**నెల్లూరు అర్బన్, అక్టోబర్ 7, ప్రభాతవార్త** వైసిపి ప్రభుత్వంలో పొదలకూరు తహశీల్దార్‌గా పనిచేసిన వీర వసంత రావు అవినీతి అక్రమాలపై సాక్ష్యాధారాలతో సహా ఫిర్యాదు చేసిన ఇంత వరకు చర్యలు చేపట్టలేదని టిడిపి నాయకులు సోమవారం జిల్లా కలెక్టరు ఆనంద్‌ను కలిసి వినతి పత్రం అందించారు. రైతు సంఘం నాయకులు రాధాకృష్ణమనాయుడు, పొదలకూరు మండల టిడిపి అధ్యక్షులు తలచీరుమస్తాన్ బాబు, మద్దిరెళ్ళ నరసింహులు, కలిచేటి శ్రీనివాసులు రెడ్డి, పులిపాటి వెంకటేశ్వర్లు నాయుడులు జిల్లా కలెక్టర్ ఆనంద్‌తో మాట్లాడుతూ ఏఆర్స్ అనుమతులు లేకుండా అసైన్మెంట్ ఫేక్ పట్టాలు సృష్టించి పేదలకు పంపిణీ చేశారన్నారు. పూర్వపు తహశీల్దార్ వీర వసంతరావు నిబంధనలకు విరుద్ధంగా వాగు, కొండ, మేత, పొరంబోకు భూములకు పట్టాలు ఇచ్చారన్నారు. గతంలో పొలాలు వున్న వారికి, వాహనాలు కలిగిన వారికి, ఇన్‌కమ్ టాక్స్ కట్టే వారికి పేదలకి దక్కాల్సిన భూములను అధికార నాయకులతో కలిసి ఇష్టారీతిన పంపిణీ చేశారన్నారు. పులికల్లు గ్రామంలో వైసిపి ప్రభుత్వంలో పూర్వపు తహశీల్దారు పంపిణీ చేసిన ఫేక్ పట్టాలను జిల్లా కలెక్టర్‌కి చూపించి అందించారు. తాము గతంలో ఈ భూకుంభకోణంపై సాక్షాదారాలతో సహా ఫిర్యాదు చేసినా,పూర్తి స్థాయిలో విచారణ జరిపి ఇంత వరకు అతనిపై చర్యలు తీసుకోలేదని వాపోయారు. పూర్వపు తహశీల్దారు వీర వసంతరావు సస్పెండ్ కాకుండా ఆపుతున్న ఆ అదృష్ట శక్తులెవరో తమకు తెలపాలన్నారు. వెంటనే విచారణ వేగవంతం చేసి అతనికి చట్టరిత్యా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పాల్గొన్నారు.

## ప్రజా వేదికలో అర్జీలు వెల్లువ




**విడవలూరు, అక్టోబర్ 7, ప్రభాతవార్త** ప్రజా సమస్య పరిష్కార వేదిక కార్యక్రమం సోమవారం తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో నిర్వహించడంతో మండల ప్రజలు వారి సమస్యలను తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్జీలను పరిశీలించి పరిష్కరించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి సూపర్వైజర్ రమణి, వీఆర్ఓలు తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పట్ల దృష్టి సారించాలి



**విడవలూరు, అక్టోబర్ 7, ప్రభాతవార్త** నూతన ఎంపిడిఓగా బాధ్యతలు చేపట్టిన నగేష్ కుమారిని పరిణి, రామచంద్రపురం, ఊటుకూరు పెద్దపాలెం సర్పంచ్, భర్త పోలయ్య మర్యాదపూర్వకంగా కలిసి ఘన సన్మానం చేశారు. అభివృద్ధి పట్ల చొరవ తీసుకోవాలని ఎంపిడివోను కోరారు. దీంతో ఆమె సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు రావెళ్ల మల్లికార్జున్, సీనయ్య, సర్పంచ్ భర్త మేకల పోలయ్య తదితరులు పాల్గొన్నారు.

## కడనూతల చెరువు ఆయకట్టులో మమ్మల్ని చేర్చండి



**బిట్రగుంట, అక్టోబర్7, ప్రభాతవార్త:** బోగోలు మండలం అల్లిమడుగు పంచాయతిలోని కడనూతల గ్రామానికి చెందిన దళితులు సోమవారం తాము సాగుచేసుకుంటున్న భూములను కడనూతల చెరువు ఆయకట్టులో చేర్చాలని మండల తహసిల్దార్ సురేష్‌కు వినతిపత్రం సమర్పించారుగత 45 సంవత్సరాలుగ జిల్లా కలెక్టర్ ఆదేశాలతో తమకు 50సెంట్లు చొప్పున 25ఎకరాలు భూమిని ఇచ్చారని అయితే చెరువు ఆయకట్టు పరిధిలో లేనందున అరకొర పంటలతో జీవనం సాగిస్తున్నామని తాము సాగుచేసుకుంటున్న భూములను చెరువు ఆయకట్టులో కలపాలని వారువిన్నవించారు.ఈవిషయమై తహసిల్దార్ న్యాయం చేస్తామని దళితులకు బరోస ఇచ్చారు.

## నేడు సిఐటియు కార్మికుల సమావేశం



**కొడవలూరు (విడవలూరు), అక్టోబర్ 7, ప్రభాతవార్త** మండలం రాజుపాలెం సిఐటియు మండల ఆటో కార్మికుల సమావేశ సభ నిర్వహిస్తున్నట్లు సిఐటియు మండల కార్యదర్శి తలారి నరసింహులు ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం సాయంత్రం మసీదు ఎదురుగా ఉన్న ఎఫ్‌సిఐ గోదాం నందు సమావేశం జరుగుతుందన్నారు. ఈ సమావేశానికి జిల్లా సిఐటియు నాయకులు అజయ్ పాల్గొంటారని చెప్పారు. సిఐటియు, సిపిఎం పార్టీ నాయకులు, సభ్యులు అభిమానులు పాల్గొని ఈ సభను విజయవంతం చేయాలని ఆయన కోరారు.

## ధాతృత్వం చాటుకున్న మర్రిపాడు తహసల్దార్



**మర్రిపాడు, అక్టోబర్6ప్రభాతవార్త:** మర్రిపాడు మండలం డిసిపలి ్ల గ్రామ రెవెన్యూ సహాయకులు సుబ్బులు అనారోగ్యం కారణంగా కుమారుడు దావీదు (28) విధులు నిర్వహించేవాడు. కొద్దిరోజుల క్రితం దావీదు మృతిచెందాడు. ఈ విషయాన్ని తహసిల్దార్ జె.స్వప్నకు సమాచారం అందించారు. స్పందించిన తహసిల్దార్ ఆమె కుటుంబ ఖర్చుల కోసం 11,116రూపాయలు తన సొంత నిధులను సుబ్బులకు అందజేసి ధాతృత్వం చాటుకున్నారు.

## మర్రిపాడు ఎంపిడిఒగా నాగేశ్వర ప్రసాద్



**మర్రిపాడు, అక్టోబర్6ప్రభాతవార్త:** మర్రిపాడు నూతన ఎంపిడిఒగా నాగేశ్వర ప్రసాద్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీల్లో భాగంగా ప్రకాశం జిల్లా యర్రగుంట్ల నుంచి ఆయన మర్రిపాడుకు వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న ఎంపిడిఒ నాగమణి ముత్తుకూరుకు బదిలీ అయ్యారు. నూతన ఎంపిడిఒకు కార్యాలయ సిబ్బంది స్వాగతం పలికారు.

## ఆర్ఎస్ఆర్‌లో మెగారక్తదాన శిభిరం



**బిట్రగుంట, అక్టోబర్7, ప్రభాతవార్త:** బోగోలు మండలం కడనూతలలోని ఆర్ఎస్ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం కళాశాల ఫౌండర్ ట్రస్ట్‌మెంబర్ రామరెడ్డి కుమార్‌స్వామిరెడ్డి జ్ఞాపకార్ద ఎన్ఎస్ఎస్ వాలంటీర్ల ఆద్వర్యంలో మెగారక్తదాన శిభిరం నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్‌డాక్టర్ పివిఎస్‌రెడ్డి తెలిపారు.ఇప్పటివరకు తమ కళాశాలలో 47 రక్తదాన శిభిరాలు నిర్వహించి విద్యార్థిని,విద్యార్ధుల ద్వార 2372 యూనిట్లరక్తాన్ని దానంచేసినట్లు తెలిపాడు.ఈశిభిరం న్యావిజన్ బ్లడ్‌బ్యాంక్ ఒంగోలువారి ఆద్వర్యంలో సావేయు వారి సహాయంతో చేపట్టామన్నారు.ఈకార్యక్రమంలో అన్ని విభాగాల అదిపతులు ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు విద్యార్ధిని విద్యార్ధులు పాల్గొన్నారు.

## ఆలయ ద్వారబంద ప్రతిష్టాపన



**బిట్రగుంట, అక్టోబర్7, ప్రభాతవార్త:** బోగోలు మండలం సోమేశ్వరపురంలోని సోమేశ్వర ఆలయంలో సోమవారం స్వర్గీయ అమర బచ్చు చారిటబుల్ ట్రస్ట్ ఆద్వర్యంలో నిర్మాణంలోవున్న శ్రీబాలసుబ్రమణ్యేశ్వర ఆలయ ద్వారబంద ప్రతిష్టాపన కార్యక్రమం జరిగింది.ఆలయ కార్యనిర్వహణాదికారి అరవ రాధాకృష్ణ ఆద్వర్యంలో నిర్వహించిన ఈకార్యక్రమంలో సాయీ సేవకులు పాల్గొన్నారు.

## రేషన్ డీలర్ల ఉపాదికి దెబ్బతినకుండ న్యాయం చేయండి



**బిట్రగుంట, అక్టోబర్7, ప్రభాతవార్త:** బోగోలు మండలంలోని రేషన్‌దుకాణాల్లో జిఒనంబర్ 35ను అనుసరించి ఇచ్చిన జిఒ10ప్రకారం బైఫర్‌కేషన్‌రేషనైలేజేషన్ ప్రకారం డీలర్ల ఉపాదికి దెబ్బతినకుండ న్యాయం చేయాలని మండల రేషన్‌డీలర్ల సంఘం నేతలు తహసిల్దార్ సురేష్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు.ప్రభుత్వ ఉత్వర్వులమేరకు కొత్తషాపులు కార్డులసంఖ్య ఎక్కువ వుందనే కారణంలో ఏర్పాటుచేయబోతున్నారని దానికి ముందుగ ఆయా షాపుల పరిధిలో చనిపోయినవారి కార్డులను సర్వే చేయించి తొలగించి దానిప్రకారం బైఫర్‌కేషన్ చేయాలనివారు విజ్ఞప్తిచేశారు.వినతిపత్రం అందజేసినవారిలో మండల రేషన్‌డీలర్ల సంఘ అద్యక్షుడు జనపాల సురేష్‌రెడ్డి,కార్యదర్శి సిహచ్ సీనయ్యఅసోషియేషన్ సబ్యులు పాల్గొన్నారు.

## అన్నపూర్ణాదేవిగా బద్రకాళీమాత.




**కలిగిరి, అక్టోబర్07, ప్రభాతవార్త;** కలిగిరి మండలం తెల్లపాడులో ఉన్న బద్రకాళీ దేవి ఆలయంలో దశరా శరన్నవరాత్రి వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. శ్రీ బద్రకాళీదేవి రోజూ ఒక అవతారంలో బక్తులకు దర్శన బాగ్యం కల్పిస్తుంది. ఈక్రమంలో సోమవారం 5వరోజు అమ్మవారు శ్రీ అన్నపూర్ణాదేవి రూపంలో బక్తులకు దర్శన బాగ్యం కల్పించారు. ఉదయం అమ్మవారికి వేశేషమైన పంచామృత స్తాపన అబిషేకములు ఆచరించారు. అనంతరం ప్రత్యేక కుంకుమ పూజ, ప్రత్యేక పూజలు అనంతరం తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈకార్యక్రమంలో ఉబయదాతలు, బక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నట్లు ఆలయ ధర్మకర్త జూపూల్లి వెంకట్వేర్లు తెలిపారు.కలిగిరిలోని శ్రీపర్వద వర్దినీ సమేత శ్రీ రామలింగేశ్వరస్వామి ఆలయంలో దశరా నవరాత్రి వేడుకలు అంగరంగ వైభవంగా జరుగుతున్నయి. ఆలయ ధరర్మక్త సుద్దల శ్రీనివాసులు ఆద్వర్యంలో ఆలయ ఆగమ పండితులు ఆదిత్యశర్మ.అమ్మవారికి 5వరోజు అన్నపూర్ణాదేవిరూపంలో బక్తులకు దర్శన బాగ్యం కల్పించారు. ఈసందర్బంగా మహిళలు పూఎద్దఎత్తున అమ్మవారి ప్రత్యేకపూజల్లో పాల్గొన్నారు.

## మారెళ్ల వెంకట శేషారెడ్డికి టిటిడిలో అరుదైన గౌరవం



**కలిగిరి, అక్టోబర్07, ప్రభాతవార్త;** తిరుమలతిరుపతి దేవస్థానంవారు కలిగిరి మండలం తెల్లపాడు వాసిని అరుదైన గౌరవంతో సత్కరించారు.కలిగిరి మండలం తెల్లపాడుకు చెందిన మారెళ్ల వెంకట రమణారెడ్డిని టిటిడివారు శ్రీవారి బ్రహ్మోత్సావాల్లో బాగంగా ఘనంగా సత్కరించారు. రమణారెడ్డి తెలిపిన వివరాల మేరకు శ్రీ వెంకటేశ్వరస్వామి బక్తుడైన ఈయన స్వామివారిమీద భక్తితో పూజలు చేసేవారు. ఆక్రమంలో రమణారెడ్డి మధిలో తలచిన విదంగా శ్రీ మహాభారతం ప్రశ్నావళి అనే పుస్తకాన్ని రచించారు.ఈ పుస్తకాన్ని తిరుమల తిరుపతి దేవస్థానంవారికి అందజేయడం జరిగింది.ఈ క్రమంలోశ్రీ వెంకట్వేరస్వామి బ్రహ్మోత్సవాలు జరుగుతున్న సందర్బంలో వెంకట రమణారెడ్డినిఘనంగా సత్కరించారు. ఈసందర్బంగా రమణారెడ్డి మాట్లాడుతూ తాను రచించిన మహాభారతం ప్రశ్నావళిని టిటిడివారు గుర్తించి తనకు ఇంతటి సత్కారం చేయడం తన పూర్వజన్మ సుకృతమన్నారు. ఏడుకొండలవాడు దయతో తాను ఈపని చేయగలిగానని, ఆ ఏడుకొండల వాడి సన్నిదిలోనే తనకు జరిగిన సత్కారం జీవితంలో గుర్తుండి పోతుందన్నారు.

## క్యాన్సర్ స్క్రీనింగ్ టెస్టు సేవలు సద్వినియోగం చేసుకోవాలి




**కోవూరు, అక్టోబర్7 ప్రభాతవార్త :** కోవూరు తాలూకా కార్యాలయంలో వీపీఆర్ ఫౌండేషన్ సిమ్స్ సహకారంతో కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన క్యాన్సర్ స్క్రీనింగ్ టెస్టు బస్సు గురువారం వరకు అందుబాటులో ఉంటుందని , ఈ క్యాన్సర్ స్క్రీనింగ్ టెస్టు సేవలను కోవూరు మండల ప్రజలు ఉపయోగించుకోవాలన్నారు. ప్రైవేట్ హాస్పిటల్‌లో వేలాది రూపాయలు ఖర్చు పెడితేనే ఈ టెస్టులు జరుగుతాయని, ఇటువంటి మంచి అవకాశాన్ని కోవూరు ప్రజలు పూర్తిస్థాయిలో ఉపయోగించుకోవాలన్నారు.

## కోవూరు షుగర్ ఫ్యాక్టరీకి పూర్వ వైభవం తేవాలి



**కోవూరు, అక్టోబర్7 ప్రభాతవార్త :** కోవూరు మండలం పోతిరెడ్డిపాలెం గ్రామంలో 125 ఎకరాల విస్తీర్ణంలో 50 ఏళ్ల చరిత్ర కలిగిన కోవూరు చక్కెర కర్మాగారానికి తిరిగి పూర్వ వైభవం తెచ్చేలా అధికారులు చొరవ తీసుకోవాలని కోవూరు సీపీఎం పార్టీ చెరుకు రైతుల సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కలెక్టర్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వం వాగ్దానం మేరకు 300 కోట్లు వెచ్చించి చక్కెర ఫ్యాక్టరీని పున: నిర్మించాలన్నారు. ఈ విషయంలో జిల్లా కలెక్టర్ చొరవ తీసుకుని ఫాక్టరీని పరిశీలించి అఖిలపక్ష రైతులతో సమావేశం కావాలన్నారు. ఫ్యాక్టరీలో తోలుతున్న ఇసుక డంపింగ్ యార్డును తొలగించాలని ఈ సందర్భంగా వారు కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు శేషయ్య, శ్రీరాములు, శ్రీనివాసులు, వెంకమరాజు, పుల్లయ్య, బుజ్జయ్య, మోహన్, సురేష్, తదితరులు ఉన్నారు.

## వైఆస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహం ధ్వంసంకు యత్నం



**వరికుంటపాడు, అక్టోబర్ 7, ప్రభాతవార్త :** మండలంలోని తోటలచెరువుపల్లి గ్రామ బస్‌స్టాండ్ సెంటర్‌లో ఉన్న దివంగత ముఖ్యమంత్రి వైఎస్‌రాజశేఖర్‌రెడ్డి విగ్రహాన్ని గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేసేందుకు ప్రయత్నాలు చేయగా వైఎస్ విగ్రహంలో ఉన్న చేయి విరిగిపోయిందని వైకాపా శ్రేణులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.పట్టపగలే గ్రామంలో ఉన్న వైఎస్ విగ్రహాన్ని పగలకొట్టెందుకు దుండగలు పన్నాగం పన్ని సోమవారం మధ్యాహ్న సమయంలో వైఎస్ఆర్ విగ్రహంలో ఉన్న చేతిని విరగకొట్టారనీ దీంతో గ్రామంలో ఉధృక్త వాతావరణం నెలకొంది. విగ్రహం ధ్వంసం పై వైకాపా మండల కన్వీనర్ మందలపు తిరుపతి నాయుడు,మాజీ ఎఎంసి డైరెక్టర్,తోటల చెరువుపల్లి గ్రామ నాయకుడు దాసరి యర్రా ఓబయ్య ఆధ్వర్యంలో పోలీసులకు ఫిర్యాదు చేశారు.విగ్రహాన్ని ద్వంసం చేసిన వారిని వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు.న్యాయం జరగని పక్షంలో చలో తోటలచెరువుపల్లి కార్యాక్రమాన్ని నిర్వహించేందుకు వైకాపా నేతలు సిద్ధం అవుతున్నారు.వైఎస్ఆర్ విగ్రహం ధ్వంసం పై జిల్లా వైకాపా నేతల దృష్టికి సైతం గ్రామ వైసీపీ నేతలు తీసుకుపోయారు.జిల్లా నేతల సూచన మేరకు తదుపరి కార్యచరణ చేపడతామన్నారు.వైకాపా కు కంచుకోట అయిన తోటలచెరువుపల్లి గ్రామంలో ఇలాంటి ఘటన జరగడంతో మండలంలో ఓ సంచలనంగా మారింది.

## అంగన్‌వాడీ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి



**కోవూరు,అక్టోబర్7 ప్రభాతవార్త :** పూర్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు విద్యాబుద్ధులు అందిస్తున్న అంగన్‌వాడీ కేంద్రాలను తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాధిక తెలిపారు. కోవూరు పంచాయతీ పరిధిలోని పెళ్లకూరు కాలనీలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాలను సోమవారం ఆమె ఆకస్మికంగా పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ ప్రతి అంగన్‌వాడీ టీచర్, చిన్నారులకు ఆట పాటలతో కూడిన విద్యను అందించాలన్నారు. ప్రతి నెల 10వ తేది లోగా చిన్నారుల యొక్క ఎత్తు బరువులు తూచి యాప్‌లో వాటిని నమోదు చేయాలన్నారు. ఈ సందర్భంగా ఆమె అంగన్‌వాడీ కార్యకర్తలకు పలు సూచనలు చేశారు.

## ఏపీహెచ్ఈడబ్ల్యూఏ నాయకులను సన్మానించిన భానుమూర్తి




**నెల్లూరు అక్టోబర్ 7, ప్రభాతవార్త-వైద్యం** ఆంధ్రప్రదేశ్ హెల్త్ ఎడ్యుకేటర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర సర్వసభ్య సమావేశం ద్వారా ఏకగ్రీవంగా ఎన్నికైన రాష్ట్ర నాయకులను ఆ సంఘ గౌరవ అధ్యక్షుడు మలినేని భానుమూర్తి సోమవారం నగరంలో ప్రైవేటు భవనంలో ఘనంగా అభినందించారు. రాష్ట్ర గౌరవ అధ్యక్షులుగా మలినేని భానుమూర్తి- గుంటూరు జిల్లా, రాష్ట్ర అధ్యక్షుడిగా డబ్ల్యూ వెంకటరమణ- కర్నూలు జిల్లా, రాష్ట్ర జనరల్ సెక్రటరీగా- చేజర్ల సుధాకరరావు, నెల్లూరు జిల్లా, రాష్ట్ర అసోసియేట్ ప్రెసిడెంట్‌గా టి.జయప్రకాష్- కడప జిల్లా, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీగా సయ్యద్ బేగం-విశాఖపట్నం జిల్లా, రాష్ట్ర కోశాధికారిగా -ఎన్ హరిప్రసాద్-నెల్లూరు జిల్లా, రాష్ట్ర పబ్లిసిటి సెక్రటరీ ఎం.టాటాబాయ్-చిత్తూరు జిల్లా,రాష్ట్రఉపాధ్యక్షుడిగా మహమ్మద్ రఫీ- చిత్తూరు జిల్లా, రాజేంద్ర కుమార్- కృష్ణాజిల్లా, శివరామకృష్ణ-విశాఖపట్నం జిల్లా, ఎవి విజయభాస్కర్- ప్రకాశం జిల్లా, ఎస్.విజయలక్ష్మీ- శ్రీకాకుళం జిల్లా, యువి రమణ-అనంతపురం జిల్లా, డి.వెంకటగిరి బాబు-విజయనగరం జిల్లా,రాష్ట్ర మహిళా వింగ్ సెక్రటరీలుగా పద్మావతి - కర్నూలు జిల్లా, పి.ఉమా సీతా మహాలక్ష్మీ- పశ్చిమగోదావరి జిల్లా, వై.అనురాధ- ప్రకాశం జిల్లా, ఆర్.ధనలక్ష్మీ- శ్రీకాకుళం జిల్లా, జి.సునీత - నెల్లూరుజిల్లా,ఎన్.గోపి- చిత్తూరుజిల్లా, ఎస్.విజయ కుమార్-అనంతపురం జిల్లా, బి.మంగ- శ్రీకాకుళం జిల్లా రాష్ట్ర ఎగ్జిక్యూటీవ్ కమిటీమెంబర్స్‌గా అనిల్ కుమార్- విజయనగరం జిల్లా, సత్య వతి- తూర్పు గోదావరి జిల్లా, డి.తులసి-పశ్చిమగోదావరి జిల్లా, సుమతి - ప్రకాశం జిల్లా పి.మంగమ్మ- విశాఖపట్నం జిల్లా, వాణిశ్రీ - కృష్ణాజిల్లా, ఎస్. అనంత కుమారి- గుంటూరు జిల్లా, ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికన ఏకగ్రీవంగా ఎన్నికైన వారిని సత్కరించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు మలినేని భానుమూర్తి, తెలుగు నాడు స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఏపీ గవర్నమెంట్ మెడికల్ ఎంప్లాయిస్ స్టేట్ ప్రెసిడెంట్, ఏపీ గవర్నమెంట్ మెడికల్ ఎంప్లాయిస్ స్టేట్ ప్రెసిడెంట్ మాట్లాడుతూ హెల్త్ ఎడ్యుకేటర్స్ డిమాండ్ల సాధనలో పూర్తి స్థాయిలో కృషిచేస్తానని దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానన్నారు. రాష్ట్రఅధ్యక్షుడు డబ్ల్యూ వెంకటరమణ, రాష్ట్ర జనరల్ సెక్రటరీ చేజర్ల సుధాకరరావులు మాట్లాడుతూ న్యాయమైన డిమాండ్లను, సమస్యలు పరిష్కరించేందుకు అందురు సహకారంతో కృషి చేస్తామని అసోసియేషన్ అభివృద్ధికి తమ వంతు తోడ్పాటునందిస్తామని తెలిపారు.

## మృతుడు గుర్తింపు



**మనుబోలు, అక్టోబర్ 7, ప్రభాతవార్త** మండలంలోని వీరంపల్లి క్రాస్ రోడ్డు వద్ద సెప్టెంబర్ 8వ తేదీ మృతి చెందిన గుర్తు తెలియని వ్యక్తిని మనుబోలు పోలీసులు గుర్తించారు. ఎస్సై రాకేష్ మృతుడు గురించి జిల్లాలో పలు పోలీసు స్టేషన్లకు సమాచారం ఇచ్చారు. ఈ ప్రయత్నంలో ఎస్సై రాకేష్ విచారణ పురోగతి లభించింది. నెల్లూరు రూరల్ మండలం ధనలక్ష్మీపురంకు చెందిన మామిళ్ళ విష్ణువర్ధన్‌గా పోలీసులకు సమాచారం వచ్చింది. దీంతో మృతుడు గురించి మీడియాకు పోలీసులు తెలిపారు.

## నేడు మండల మీట్

**మనుబోలు, అక్టోబర్ 7, ప్రభాతవార్త** మండల కేంద్రమైన మనుబోలు మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఉదయం 10.30గంటలకు జనరల్ బాడీ సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు తప్పకుండా పాల్గొనాలని ఎంపీడీఓ విజ్ఞప్తి చేశారు.

## పట్టణ ఆరోగ్య కేంద్రంలో ఆకస్మిక తనిఖీ



**నెల్లూరు, అక్టోబర్ 7, ప్రభాతవార్త-వైద్యం** స్థానిక వేదాయపాలెం చంద్రమౌళినగర్‌లో ఉన్న పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని సోమవారం అదనపు జిల్లా వైద్య శాఖ అధికారి, టీబీ నివారణ అధికార డాక్టర్ ఖాదర్ వల్లి ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. టీబీకి సంబంధించిన రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో టీబీ కేసులను నివారించడమే ధ్యేయంగా సిబ్బంది పని చేయాలన్నారు. పెద్దలకు వేస్తున్న టీబీ నివారణ టీకాను నూరు శాతం పూర్తి చేయాలని ఆదేశించారు.

## వినతులపై ప్రత్యేక దృష్టి

**నెల్లూరు అర్బన్, అక్టోబర్ 7, ప్రభాతవార్త** జిల్లాలో ప్రజాప్రతినిధుల నుండి వచ్చిన వినతులపై వెంటనే చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఓ ఆనంద్ అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని శంకరన్ హాల్‌లో ప్రజాప్రతినిధుల నుండి వచ్చిన వినతులపై తీసుకున్న చర్యలు గురించి జిల్లా అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రజాప్రతినిధుల నుండి వచ్చిన వినతులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని జిల్లా అధికారులకు సూచించారు. జిల్లాలో ప్రజాప్రతినిధుల నుండి వచ్చిన అర్జీలను మూడు నెలలోగా పరిష్కరించాలన్నారు. ప్రజాప్రతినిధుల నుండి వచ్చిన అర్జీలను పరిష్కరించడంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని కలెక్టర్ అధికారులు ఆదేశించారు. ప్రభుత్వ ఉత్తర్వులు మేరకు చేయదగ్గ పనులను వెంటనే చేపట్టాలన్నారు. చేయలేని పనులపై స్పష్టమైన వివరాలతో తెలియజేయాలని ఆయన చెప్పారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎస్. లవన్న, జిల్లా పంచాయితీ అధికారి శ్రీధర్ రెడ్డి, డిఆర్‌డిఏ ప్రాజెక్టు డైరెక్టర్ నాగరాజకుమారి, డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ గంగాభవాని, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సత్యవాణి, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి సుబ్బారెడ్డి, మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

## మూడు ఇసుక ట్రాక్టర్లు సీజ్



**గుడ్లూరు, అక్టోబర్ 7, ప్రభాతవార్త** గుడ్లూరు మండలం చెవూరు గ్రామంలో అక్రమంగా ఇసుక తోలుతున్న మూడు ట్రాక్టర్‌లను అదుపులోకి తీసుకుని సీజ్ చేసినట్లు ఎస్సై వెంకటరావు తెలిపారు.

## కామాక్షీదేవిగా నాగారపమ్మ



**వరికుంటపాడు,అక్టోబర్ 7,ప్రభాతవార్త :** వరికుంటపాడు గ్రామంలో వెలిసియున్న శ్రీ నాగారపమ్మ అమ్మవారు సోమవారం శరన్నవరాత్రుల ఉత్సవాలలో భాగంగా కామాక్షీదేవి అలంకరణలో దర్శన మిచ్చి పూజలందుకుంది.అలాగు తూర్పు రొంపిదొడ్ల గ్రామంలో ఉన్న శ్రీ మానసా దేవి అమ్మవారు స్కంద మాత అలంకారంలో దర్శన మిచ్చింది.చల్లా వంశస్థుల ఆధ్వర్యంలో వేడుకలు అత్యంత వైభంగా నిర్వహిస్తున్నారు.ఆలయాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు.

## దళిత గిరిజన సంక్షేమ పథకాలను వెంటనే పునరుద్దరించాలి



**నెల్లూరు అర్బన్, అక్టోబర్ 7, ప్రభాతవార్త** ఎత్తివేసిన దళిత గిరిజన సంక్షేమ పథకాలను వెంటనే పునరుద్దరించాలని దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షులు ఎస్ మల్లి పేర్కొన్నారు. సోమవారం నెల్లూరులోని జిల్లా కలెక్టర్‌కు దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షులు ఎస్. మల్లి ఆధ్వర్యంలో వినతిపత్రం అందించారు. అనంతరం ధర్నా నిర్వహించి దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షులు ఎస్ మల్లి మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా కలెక్టర్ దృష్టికి గత ప్రభుత్వం ఎస్‌సి ఎస్‌టి కార్పొరేషన్ ద్వారా అమలు చేసే దళిత గిరిజన సంక్షేమ పథకాలను ఎత్తివేస్తారని తెలిపారు. జగనన్న ప్రభుత్వం పోయిన తర్వాత చంద్రన్న ప్రభుత్వం వచ్చి వంద రోజులు పైన అవుతున్నప్పటికి ఈ సంక్షేమ పతకాల మాట కూడా మాట్లాడటం లేదన్నారు. గతంలో చంద్రన్న ప్రభుత్వం ఉన్నప్పుడు భూమి కొనుగోలు పథకం, కళ్యాణ మిత్ర పథకం ద్వారా లక్ష రూపాయిలు జంటలకు ఇవ్వడం, నిరుద్యోగులకు వాహనాల సౌకర్యం కల్పించారు. ఇన్నోవా కార్లు, ఆటోలు వంద ట్రాక్టర్లు, 50 వరికోత మిషన్‌లు 20, భూమి అభివృద్ధి చేసుకొనుటకు లక్ష రూపాయిల రుణం, కార్పొరేషన్ ద్వారా లక్ష నుండి ఐదు లక్షల వరకు రుణం కల్పించేవారన్నారని తెలిపారు. ఈ విధంగా చంద్రన్న ప్రభుత్వం అమలు చేసేవారని అన్నారు. చంద్రన్న వచ్చినా ఒక పథకం గురించి కూడా మాట్లాడటం లేదన్నారు. పథకాలు లేకపోవడం వలన దళిత గిరిజనులు ఉపాధి కూలీలుగా మారిపోయారని అన్నారు. కాబట్టి సిఎం చంద్రబాబు నాయుడు వెంటనే పథకాలు పునరుద్ధరించి బడుగు వర్గాల యువతి యువకులను ఆదుకోవాలని తెలిపారు. కలెక్టర్ ప్రభుత్వం దృష్టికి తీసుకొనిపోతామని తెలియచేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జాలాది శ్రీనివాసులు, పి. శివయ్య, కోవూరు దాసు, చలంచర్ల మణి, కత్తి వెంకట రమణ, అనేక మంది పాల్గొని నిరసన తెలియజేశారు.

## నిరుపేదలకు దుప్పట్లు, భోజనం అందచేసిన హ్యాపిసేవాసంస్థ




**కావలి రూరల్, అక్టోబర్ 7 ప్రభాతవార్త** కావలి రూరల్ మండలం ఆముదా లదిన్నె గిరిజన కాలనినందు హ్యాపి సేవా సంస్థ ఆధ్వర్యంలో కావలి పట్టణనివాసులైన కీర్తిశేషులు నల్లూరు రామ్మూర్తి 11వ వర్ధంలి సందర్భంగా వారి కుమారుడు నల్లూరు మధుబాబు, గోపీచంద్ దాతృత్వంతో సోమవారం గిరిజనులకు దుప్పట్లు, భోజనం అందచేయడం జరిగింది. హ్యాపిసేవాసంస్థ అధ్యక్షులు సయ్యద్ ఘనిబాష మాట్లాడారు. గత రెండు సంవత్సరాలుగా కీర్తిశేషులు నల్లూరు రామమూర్తి వర్ధంతి సందర్భంగా హ్యాపి సేవాసంస్థద్వారా సేవాకార్యక్రమాలు చేపడుతున్న వారి కుమారులు మధుబాబు, గోపీచంద్,వారి కుటుంబ సభ్యులకు ధన్యవాదాలు తెలియచేయడం జరిగింది. పేదలకు సహాయపడే ఇలాంటి మంచి కార్యక్రమం మా సంస్థద్వారా చేపట్టడం చాలా సంతోషంగా ఉందని తెలియచేశారు. ప్రతి ఒక్కరూ ఇదే విధంగా పేద ప్రజలకు చేతనైన సహాయం అందించాలని తెలియచేశారు. ఈ కార్యక్రమంలో లోక్‌అదాలత్ సభ్యులు యం.మాలకొండారెడ్డి, హ్యాపి సేవాసంస్థ సలహాదారు చేవూరు ప్రభయ్య, షేక్.చాన్‌బాష, సయ్యద్ నౌషద్‌ఆలీ, సోమిశెట్టి బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

## పక్షవాత బాధితుడికి వాకర్ వితరణ చేసిన సంయుక్త సేవాసంస్థ



**కావలి రూరల్, అక్టోబర్ 7 ప్రభాతవార్త** కావలి పట్టణం శివరామసుబ్బయ్య గిరిజన కాలనిలో నివాసముంటున్న వృద్ధుడు పోతురాజు అనే పక్షవాత బాధితు డికి ఎ.బానుకుమార్ సహకారంతో సోమవారం వాకర్‌ను విరతణ చేయడం జరిగింది.ఈ సందర్భంగా సం యుక్త సేవాసంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు గంగపట్నం సురేంద్ర మాట్లాడారు. పోతురాజు గత కొన్నిసంవత్సరాల క్రితం నుంచి అనా రోగ్యకారణంగా మంచానికే పరిమితం కావడం జరిగిందని, ఇటీవల పక్షవాతం రావడంతో మరింతగా అనారోగ్యం బారిన పడడంతో నడవడానికే కష్టంగా మారిందని తెలియచేశారు. అతని పరిస్థితిని గుర్తించి సంయుక్త సేవాసంస్థ ద్వారా దాత భానుకుమార్ సహకారంతో వాకర్ వితరణ చేయడం జరిగిందని తెలియచేశారు. దాత భానుకుమార్‌కు ధన్యవాదాలు తెలియచేశారు.

## ఐరా ఫ్యాషన్స్‌ను ప్రారంభించిన రెవ డాక్టర్ జిడిడి దివాకర్



**కావలి రూరల్, అక్టోబర్ 7 ప్రభాతవార్త** కావలి పట్టణం ఏబియం కాంపౌండ్‌లోని జమున కాంప్లెక్స్‌నందు జెంట్స్ , లేడీస్, కిడ్స్, అన్ని వి భాగాలకు సంబంధించిన ఐ రాఫ్యాషన్స్‌ను సోమవారం పిఎబిసి ఎగ్జిక్యూటివ్ డైరక్టర్ రెవడాక్టర్ జిడిడి దివాకర్ నూతనంగా ప్రా రంభించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయనకు షాపు నిర్వహకులు పూర్ణ కుంభంతో, మేళతాళాలతో ఘనంగా స్వాగతం పలకడం జరిగింది. అనంతరం జ్యోతిప్రజ్వలన చేసి ప్రత్యేక పూజలకు నిర్వహించడం జరిగింది. షాపు నిర్వహకులు రెవ డాక్టర్ జిడిడి దివాకర్‌ను,హోమియో వైద్యులు వింత క్రిష్ణారెడ్డిని దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించడం జరిగింది. చిన్నపిల్లలకు, మహిళలకు, పురుషులకు, కుటుంబంలోని అందరికి కావల్సిన బట్టలను ఒకేచోట ఏర్పాటు చేసిన ఐరా ఫ్యాషన్స్ నిర్వహకులను రెవ డాక్టర్ జిడిడి దివాకర్ అభినందించడం జరిగింది.

## కార్యదర్శిగా బాధ్యతలు



**విడవలూరు, అక్టోబర్ 7, ప్రభాతవార్త** మండల కేంద్రం నూతన పంచాయితీ కార్యదర్శిగా యస్థాని భాష సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఏఎస్ పేట మండల కేంద్రం నుండి సాధారణ బదిలీలో రావడం జరిగిందని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ ప్రజలకు అందుబాటులో ఉండి విధి నిర్వహణపై నిర్లక్ష్యం చేయనని గ్రామాభివృద్ధి పట్ల చొరవ చూపడం జరుగుతుందని తెలిపారు.

## ఎంపిటిసిల వేతనాలపై చొరవ చూపాలి



**విడవలూరు, అక్టోబర్ 7, ప్రభాతవార్త** మండలంలో ఎంపిటిసిలకు గౌరవ వేత నం ఆలస్యం అవుతుందని నూతన ఎంపిడిఓ నగేష్ కుమారి దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఎంపిటిసిలు మాట్లాడుతూ గతంలో 6,3 నెలలకు వేతనాలు రావడం అది ఇప్పుడు ఆలస్యం అయిందన్నారు. పలు అంశాలపై చర్చించారు. దీంతో ఎంపిడిఓ సానుకూలంగా స్పందించారు. ఎంపిపి, ఉప ఎంపిపి, ఎంపిటిసిలు, ప్రజలు పాల్గొన్నారు.

## ఎంపిడివోకు సన్మానం



**విడవలూరు, అక్టోబర్ 7, ప్రభాతవార్త** విడవలూరు ఎంపిడివోగా నూతన బాధ్యతలు చేపట్టిన నగేష్ కుమారిని మండల వైసిపి ఎంపిటిసిలు సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువాలతో సన్మానం చేసి సత్కరించి పరిచయం చేసుకున్నారు. కొద్దిసేపు ఎంపిడివోతో పలు విషయాలపై తెలియజేసి తెలుసుకున్నారు. ఎంపిపి సౌందర్య, ఉప ఎంపిపి ఆవుల శ్రీనివాసులు, చింతాటి జగన్మోహన్, అనపల్లి భాస్కర్, భానుప్రకాష్, భక్తవసల్, అక్కయ్యగారి బుజ్జమ్మ, శైలజ పాల్గొన్నారు.

## కార్యదర్శికు సన్మానం చేసిన మాజీ డిసిఎంఎస్ చైర్మన్



**కొడవలూరు (విడవలూరు), అక్టోబర్ 7, ప్రభాతవార్త** మండలం నార్త్ రాజుపాలెం పంచాయితీ కార్యదర్శి జాలయ్యను మాజీ డిసిఎంఎస్ చైర్మన్ చలపతిరావు పుష్పగుచ్ఛం అందజేసి ఘన సన్మానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయితీ అభివృద్ధిలో ఎంతో కృషి చేసి ప్రజలకు అండదండలుగా ఉండి సేవలు అందించడం అభినందనీయమని ఆయన కొనియాడారు. సర్పంచ్, బచ్చు సుప్రియ, ఎంపిపి గాలి జ్యోతి, నాయకులు కొండ శ్రీనివాసులు రెడ్డి, మాణిక్ రావు, బచ్చు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## కావలి ఎమ్మెస్సార్ డిగ్రీ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు

**కావలి, అక్టోబర్ 7 ప్రభాతవార్త** కావలి పట్టణంలోని ఎమ్మెస్సార్ డిగ్రి కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు డిగ్రి కళాశాల ప్రిన్సిపల్ ఉమ తెలిపారు. 2024 - 25 సంవత్సరంలో డిగ్రిలో ప్రవేశానికి అడ్మిషన్లు నిర్వహిస్తున్నామన్నారు. ఇందుకోసం విద్యార్థులు ఈ నెల 7వ తేది నుండి 9వ తేదీవరకు తమ ఒరిజినల్ ధృవపత్రాలతో కళాశాలలో సంప్రదించాలని కోరారు. స్పాట్ అడ్మిషన్లు పొందినవారికి హాస్టల్ వసతి, ఫీజు రియంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్పులు ప్రభుత్వంనుంచి లభించవని ఆమె తెలిపారు. మరింత సమాచారం కోసం కళాశాలను సంప్రదించాలని కోరారు.

## కోనలో గజ లక్ష్మీ దేవి గా ఆదిలక్ష్మీ దేవి



**పెంచలకోన(రాపూరు),అక్టోబరు7ప్రభాతవార్త** ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలోని శ్రీ పెనుశిల లక్ష్మీ నరసింహ స్వామి వారి పట్టమహిషి శ్రీ ఆదిలక్ష్మీఅమ్మవారికి నిర్వహిస్తున్న శంన్నవరాత్రి ఉత్సవాలలో బాగంగా ఐదవ రోజైన సోమవారం ఆదిలక్ష్మీ అమ్మవారికిగజ లక్ష్మీ దేవి అలంకారం నిర్వహించారు. ఇందులో బాగంగా ఉదయం అమ్మవారి మూలమూర్తికి వస్త్రసమర్పణ, పుష్పాలంకరణ నిర్వహించారు.ఉదయం 10 గంటలకు అమ్మవారికిపాలు,పెరుగు ,తేనే.నెయ్యి ,పంచదాలతో పాటు,పలు రకాలైన పండ్ల రసాలు,సుగంధ ద్రవ్యాలతో స్నపన తిరుమంజనం(అభిషేకం),నిర్వహించారు. తదుపరి అమ్మవారికి గజ లక్ష్మీ దేవి అలంకారం నిర్వహించారు. సాయంత్రం అమ్మవారి మూలమూర్తికి పూలాంగి సేవనిర్వహించారు. సాయంత్రం సామూహిక కుంకుమార్చన కార్యక్రమం నిర్వహించారు. తదుపరి అమ్మవారికిప్రాకారోత్సవం నిర్వహించారు. ఆలయ ఉప కమీషనర్ పోరెడ్డి శ్రీనివాసుల రెడ్డి పర్యవేక్షణలో,ఆలయ ప్రధానార్చకులు గుండ్లూరు రామయ్య స్వామి, పెంచలయ్య స్వాముల ఆధ్వర్యంలో అమ్మవారికి పూజా కార్యక్రమాలు ఆలయ అర్చక స్వాములు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని ధైర్య లక్ష్మీ అలంకారం లోనిఆధిలక్ష్మీ అమ్మవారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ సీనియర్ సహాయకుడుపాలవల్లి లక్ష్మీ నారాయణ, అర్చక స్వాములు శశి స్వామి, మధు స్వామి, వినోద్ స్వామి,వర్ధన్ స్వామి, నాగరాజు స్వామి,ఆలయ వేదపండితులు పాల్గొన్నారు.ఈ కార్యక్రమాలకు ఉభయకర్తలుగా పోతవరంకు చెందిన దామెర్లసత్య శ్రీనివాస్,లలితాలక్ష్మీ, నెల్లూరుకు చెందిన మాజీ దేవస్థానం చైర్మన్ అమరా శ్రీరాముల శ్రేష్టి,బద్వేల్‌కు చెందిన పి.హజరత్తయ్య.వెంకట సుధామణిగార్లు వ్యవహరించారు.

## శ్రీ మహా ఛండీ దేవి అలంకారంలో రాపూరమ్మ తల్లి



**రాపూరు,అక్టోబరు7ప్రభాతవార్త** మండల కేంద్రమైన రాపూరు గ్రామ దేవత రాపూరమ్మ తల్లికి నిర్వహిస్తున్న శరన్నవరాత్రి ఉత్సవాల లోబాగంగా అమ్మవారికి ఐదవ రోజైన సోమవారం శ్రీ మహా ఛండీదేవి అలంకారం నిర్వహించారు. ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం అమ్మవారికి పలు రకాలైన పుష్పాలతో శోబాయమానంగా అలంకారం నిర్వహించి శ్రీ మహా ఛండీ దేవి అలంకారం చేశారు. పెద్ద ఎత్తున భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొని శ్రీ మహా ఛండీ దేవి అలంకారంలో వున్న రాపూరమ్మ తల్లినిదర్శించుకోని పూజలు నిర్వహించారు.రాత్రి 9 గంటలకు అమ్మవారికి పల్లకీసేవ నిర్వహించారు.ఈ కార్యక్రమాలకు ఉభయకర్తలుగా రాపూరు లక్ష్మీపురంకి చెందిన వెలుగోటి శ్రీనివాసుల రెడ్డి, గంధం మల్లిఖార్జున వ్యవహరించారు.

## కండలేరులో గల్లంతైన వ్యక్తి మృతి



**ఓబులాయపల్లి(రాపూరు),అక్టోబరు6 ప్రభాతవార్త** కండలేరు జలాశయంలో చేపల వేటకు వెళ్లి ఆదివారం సాయంత్రం గల్లంతైన పంతగిరి చెంచయ్య(27)మృతి చెందినట్లు రాపూరు ఎస్ఐ యం.వెంకట రాజేష్ తెలిపారు. సోమవారం ఉదయం జలాశయంలో గాలింపుచర్యలు చేపట్టగా చెంచయ్య మృత దేహం లభ్యమైనట్లు ఆయన తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకోని మృతదే హాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాపూరు ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించినట్లు ఆయన తెలిపారు.

## పెంచలకోనలో పెంచలస్వామిని దర్శించుకోన్న బుల్లితెర నటి శ్రీ సత్య



**పెంచలకోన(రాపూరు),అక్టోబరు7 ప్రభాతవార్త** ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలోని శ్రీ పెనుశిల లక్ష్మీ నరసింహ స్వామి వారిని సోమవారం బుల్లితెరనటి శ్రీ సత్య దర్శించుకున్నారు. కోనకు వచ్చిన బుల్లితెర నటికి శ్రీ సత్యకు ఆలయ అధికారులు శ్రీ పెనుశిల లక్ష్మీనరసింహ స్వామి వారికి, శ్రీ ఆదిలక్ష్మీ అమ్మవారికి, శ్రీ అంజనేయ స్వామి వారి సన్నిదిలో ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామి వారి తీర్థ ప్రసాదాలను ఆందజేశారు. ఈ సందర్భంగా ఆమె నవరాత్రి ఉత్సవాలలో గజలక్ష్మీ దేవిగా వున్న శ్రీ అధిలక్ష్మీ అమ్మవారిని దర్శించుకోని పూజలు నిర్వహించారు.

## నూతన ఆర్డీఓ వంశిక్రిష్ణను కలిసిన వివిధ స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు



**కావలి రూరల్, అక్టోబర్ 7 ప్రభాతవార్త** కావలి రెవిన్యూ డివిజనల్ అధికారిగా నూతనంగా ఉద్యోగబాధ్యతలు చేపట్టిన యం.వంశిక్రిష్ణను కావలిలోని వివిధ స్వచ్ఛంద సంస్థల గౌరవఅద్యక్షులు షేక్.ఖాదర్‌బాషా ఆధ్వర్యంలో వివిధ స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు సోమవారం ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి పూల బొకెను అందచేసి దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించడం జరిగింది. అనంతరం వివిధ స్వచ్ఛంద సంస్థల నిర్వహకులు ఆర్డీఓ వంశిక్రిష్ణకు పరిచయంచేసుకోవడం జరిగింది. ఈ సందర్భంగా షేక్.ఖాదర్‌బాషా మాట్లాడారు. వివిధ స్వచ్ఛంద సంస్థలు కావలి మరియు పరిసరప్రాంతాలలో వివిధ రంగాలలో పేద, బడుగు, బలహీనవర్గాలవారికి దాతల సహకారంతో చేస్తున్నటువంటి సామాజిక సేవా కార్యక్రమాలను ఆర్డీఓకు తెలియచేయడం జరిగిందని తెలియచేశారు. విద్యార్థులకు విద్యవలన కలుగు ప్రయోజనాలు, వారి పాత్ర, విద్యార్థులకు బాల్యవివాహాలు, గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్ తదితరవాటిమీద అవగాహన కార్యక్రమాలను చేపట్టడం జరిగిందని తెలియచేశారు. వీటన్నింటిమీద ఆర్డీఓ సానుకూలంగా స్పందించడం జరిగిందని తెలియచేశారు. ఈ కార్యక్రమంలో రత్నమ్మ చారిటబుల్ ట్రస్ట్ యంవి.ప్రసాదరావు, ఆపద్బాంధవ సేవాట్రస్ట్ దామా మధుసూధనరావు, సంయుక్త సేవాసంస్థ వ్యవస్థాపక అద్యక్షులు గంగపట్నం సురేంద్ర, పియంపి ఉపాధ్యక్షులు వంటేరు మస్తానయ్య, టైంటుహెల్ప్ యన్.రమేష్, జాగో సంస్థ షేక్.జమీర్, గుడ్‌మెన్ ట్రస్ట్ అద్యక్షులు సోమిశెట్టి బ్రహ్మయ్య, ఘంటశాల రామ చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

## రాపూరు మండలానికి పలువురు నూతన అధికారుల రాక

**రాపూరు,అక్టోబరు7ప్రభాతవార్త** సాధారణ బదిలీలలో బాగంగా పలువురు నూతన అధికారులు సోమవారం రాపూరులో భాద్యతలు చేపట్టారు.రాపూరు మండల ప్రజాపరిష్ కార్యలయం ఏఓగా తిక్కవరపు ధశరధ రామి రెడ్డి భాద్యతలు స్వీకరించారు. రెవెన్యూకార్యయలంలో జూనియర్ సహాయకునిగా అరుణ్ తేజ్, బోజ్జనపల్లి వి.ఆర్.ఓగా టి.మహేంద్ర, నేల్లేపల్లి వి.ఆర్.ఓ గాటి.శ్రీహరి, జోరేపల్లి వి.ఆర్.ఓగా పేరయ్య, అకిలివలస వి.ఆర్.ఓగా ఎస్.శివ కుమార్. రాపూరు బిట్ 3 వి.ఆర్.ఓగా బి. రాజేశ్వరీలు భాధ్యతలు స్వీకరించారు.

## కార్యదర్శి హామీద్‌కి ఘనంగా వీడ్కోలు



**బుచ్చి అక్టోబర్ 7 ప్రభాతవార్త** బుచ్చిరెడ్డిపాళెం మండలంలోని నాగమాంబాపురం గ్రామ పంచాయితీ సెక్రటరీగా విధులు నిర్వహిస్తు సాధారణ బదిలీలలో భాగంగా బదలీ అయిన కార్యదర్శి హామిద్‌ను సచివాలయం సిబ్బంది ఘనంగా సన్మానించారు.ఆయన సంగం మండలం దువ్వూరు గ్రామ కార్యదర్శిగా బదలీ అయ్యారు.అందరు ఒక్కసారి బావోద్వేగానికి గురైయ్యారు. అలాగే గ్రామ సర్వేయర్‌ను కూడా వాళ్ళు సన్మానించారు.ఈ కార్యక్రమంలో సచివాలయం సిబ్బంది పాల్గోన్నారు.

## కావలి ఆర్డీఓ వంశీకృష్ణను కలిసిన జిల్లా రెడ్‌క్రాస్ ప్రతినిధులు



**కావలి, అక్టోబర్ 7 ప్రభాతవార్త** బుద్ధిమాంద్యం ఉన్న పిల్లల తల్లి తండ్రులకు జిల్లా రెడ్‌క్రాస్ నిర్వహిస్తున్న మాగుంట సుబ్బరామిరెడ్డి మానసిక వికలాంగుల కేంద్రం ఒక వరమని రెడ్‌క్రాస్ జిల్లా పాలకమండలి సభ్యులు, మానసిక వికలాం గుల కేంద్రం బాధ్యులు దాసరి రాజేంద్రప్రసాద్ కావలి ఆర్డీఓ వంశీకృష్ణకు తెలిపారు. సోమవారం వారు ఆర్డీఓ వంశీకృష్ణను మర్యాదపూర్వకంగా కలిసి జ్ఞాపికను అందచేసి దుశ్శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా రాజేంద్రప్రసాద్ మాట్లాడారు. తమ కేంద్రంలో బుద్ధిమాంద్యం, శారీరక వైకల్యం ఉన్న చిన్నారులకు ఉచితంగా ఫిజియోథెరపి, స్పీచ్ థెరపి, ఆక్యూపేషనల్ థెరపి, బిహేవియరల్ థెరపి, సెన్సార్ ఇంటిగ్రేషన్ థెరపి, తదితర వైద్యసేవలు అందిస్తున్నట్లు తెలిపారు. జిల్లా రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో రక్తకేంద్రం, క్యాన్సర్ ఆసుపత్రి, తదితర పదిహేను ప్రాజెక్టులను నిర్వహిస్తున్నట్లు ఆర్డీఓ దృష్టికి తెచ్చారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ కావలిశాఖ ఛైర్మన్, రాష్ట్ర పాలకమండలి సభ్యులు డాకారపు రవిప్రకాష్, స్పాస్టిక్ సెంటర్ ఫిజియోథెరపి వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

## డిప్యూటి తహసిల్‌దార్‌ని సన్మానించిన రేషన్‌డీలర్ల సంఘం



**బిట్రగుంట,అక్టోబర్7,ప్రభాతవార్త:** బోగోలు మండల డిప్యూటి తహసిల్‌దార్‌గ నూతనంగ బాధ్యతలు చేపట్టిన భరత్‌ను సోమవారం మండల రేషన్‌డీలర్ల సంఘం నేతలు మర్యాదపూర్వకంగ కలసి ఆయన్ను సత్కరించారు డీలర్ల ఆసోషియేషన్ అధ్యక్షుడు జనపాల సురేష్‌రెడ్డి,ఉపాధ్యక్షుడు సిహెచ్ సీనయ్య,అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

## పొదలకూరు ఎంపిడిఓగా డివిఎస్ రావు



**పొదలకూరు, అక్టోబర్ 7, ప్రభాతవార్త** పొదలకూరు ఎంపిడిగా డివిఎస్ రావు సోమవారం పదవి బాధ్యతలు చేపట్టారు. ఆయన గతంలో దుత్తలూరు, బుచ్చిరెడ్డిపాళెంలో పనిచేశారు. సాధారణ బదిలీలలో భాగంగా ఉన్నతాధికారులు ఆయనను పొదలకూరుకు బదిలీ చేశారు.

## గుండెపోటుతో యువకుడి ఆకస్మిక మృతి



**రాపూరు,అక్టోబరు7ప్రభాతవార్త** మండల కేంద్రమైన రాపూరులో గూడూరు నుండి పనుల మీద రాపూరు వచ్చిన శివ అనే యువకుడు అకస్మికంగా గుండెపోటుతో మృతి చెందిన సంఘటన సోమవారం జరిగింది. తూర్పు ఆగర్త కట్టకు వెళ్లే దారిలో మృతుడునడచి వెలుతూ అకస్మాత్తుగా కింద పడి మృతి చెందడం చూసిన స్థానికులు రాపూరు పోలీసులకు సమాచారంఅందించారు. వెంటనే ఏఎస్ఐ వెంకటేశ్వర రావు సంఘటనా స్థలానికి చేరుకోని పరిశీలించారు. మృతుడి వద్దవున్న సెల్ పోన్‌కు పోన్ రావడంతో ఆయన మాట్లాడారు. గూడూరుకు చెందిన శివ అనే యువకుడు వృత్తిరిత్యా ఎలక్ట్రిషియన్ పని మీద రాపూరుకు వచ్చి తనకు గుండెలలో నోప్పిగా వుందని,తన కాళ్ళుచేతులు లాగుతున్నాయని గూడూరులోని తన స్నేహితులకు పోన్ చేసి నట్లు పోన్ చేసిన వారు తెలిపారు. దీంతోమృతునికి గుండెపోటు రావడంతో మృతి చెంది వుంటాడని పోలీసులు బావిస్తున్నారు. ఈ మేరకు కేసు నమెదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజేష్ తెలిపారు.

